విద్యుత్‌ సమస్యలు ఉంటే సంప్రదించండి

చందానగర్‌: వేమనకాలనీ సబ్‌స్టేషన్‌ పరిధిలోని విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటే కింద వాటి నంబర్లను సంప్రదించవచ్చని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

- శ్రీనివాస్‌ రెడ్డి ఏఈ : 8712472702
- ఫూజ్‌ ఆఫ్‌ కాల్‌ : 872472711
- మోహన్‌ రావు లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ : 9948122155 (అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌, గంగారం ఏరియా, శ్రీరాం నగర్‌, బీహెచ్‌ఈఎల్‌ మెయిన్‌రోడ్డు ఏరియా, వేంకుంట, ఓల్డ్‌ బొంబాయి ఎక్స్‌ రోడ్డు, శ్రీదేవి థియేటర్‌ ఏరియా రోడ్డు, భిక్షపతి ఎన్‌క్లేవ్‌, జవహర్‌ కాలనీ రోడ్డు నం.4, 5, 6, కైలాష్‌నగర్‌, ఎస్‌వీఎస్‌ ఇన్‌ఫ్రాకాన్‌ లిమిటెడ్‌)
- జీవన్‌ లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ : 939387707 (భవానీపురం, అమీన్‌పూర్‌ రోడ్డు, వీకర్‌ సెక్షన్‌ కాలనీ, శంకర్‌నగర్‌, పద్మజ కాలనీ, గౌతమీనగర్‌)
- రమేష్‌ ఏఎల్‌ఎం : 9700905903 (పీజేఆర్‌ ఎన్‌క్లేవ్‌, కెఎస్‌ఆర్‌ ఎన్‌క్లేవ్‌, జనప్రియ టౌన్‌షిప్స్‌)
- వెంకటేష్‌ ఏఎల్‌ఎం : 9989185419 (శాంతినగర్‌, దీప్తిశ్రీనగర్‌, ఉషోదయ అపార్ట్‌మెంట్స్‌, సీబీఆర్‌ ఎస్టేట్స్‌, శాంతినగర్‌, ఆదర్శ నగర్‌)
- రమేష్‌ ఆర్టిసన్‌ : 9177772323 (సురక్ష ఎన్‌క్లేవ్‌, రాజేందర్‌రెడ్డి నగర్‌, విద్యనగర్‌, సత్య ఎన్‌క్లేవ్‌, శుభోదయ కాలనీ)
- కుమార్‌ ఆర్టిసన్‌ : 9553614407 (ఫ్రెండ్స్‌ కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్‌, వెస్ట్‌ మెట్రో అపార్ట్‌మెంట్స్‌).

27న నిధి ఆప్కే నిఖత్‌

పటాన్‌చెరు టౌన్‌: భవిష్యనిధి సంస్థ సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా ప్రతి నెల నిధి ఆప్కే నిఖత్‌ 2.0ను నిర్వహిస్తోంది. ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ కమిషనర్‌ విశాల అగర్వాల్‌ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కేంద్రాల్లో నాలుగు శిబిరాలును ఉ. 9:30 గంటల నుంచి సా.5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారంలోని ఎంఎస్‌ఎన్‌ ల్యాబ్‌రేటిస్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌లో, సంగారెడ్డి.. పోతిరెడ్డిపల్లి లిమిటెడ్‌ వరుణ్‌ బెవెరైజన్‌, హైదరాబాద్‌ శేరిలింగంపల్లి కెఫిన్‌ టెక్నాలజీస్‌ లిమిటెడ్‌, జిన్నారం మండలం గడ్డపోతారం న్యూ ల్యాండ్‌ ఫార్మ యూనిట్‌– 3లో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు పైన పేర్కొన్న మూడు కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.


ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న ఆస్పత్రి వైద్య సిబ్బంది

మియాపూర్‌: డివిజన్‌ పరిధిలోని లక్ష్మీనగర్‌ శ్రీనాగసాయి దేవాలయంలో ఎస్టీ మోర్చా జిల్లా కార్యదర్శి విజేందర్‌సింగ్‌ ఆధ్వర్యంలో సింధూ ఆస్పత్రి వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనగర్‌కాలనీ, ఓంకార్‌నగర్‌ బస్తీ వాసులకు తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యులు ఆరోగ్య విషయంలో పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచమల్ల నాగులుగౌడ్‌, మియాపూర్‌ డివిజన్‌ అధ్యక్షుడు లక్ష్మణ్‌, హాఫీజ్‌పేట్‌ అధ్యక్షుడు జితేందర్‌, దేవాలయ కమిటీ చైర్మన్‌ నాగులు, నాయకులు మాణిక్‌రావు, గణేష్‌ ముదిరాజ్‌, రత్నకుమార్‌, ప్రభాకర్‌,బాషా, శ్రీనివాస్‌, రాము తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మణికొండ: ఆస్పత్రులు, సేవా సంస్థలు ఏర్పాటు చేసే ఉచిత ఆరోగ్య శిబిరాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ కె.దశరథ్‌ యాదవ్‌ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ అలకాపూర్‌ టౌన్‌షిప్‌లో ఆదివారం ధన్వీ మల్టీ స్పెషాలిటీ క్లినిక్స్‌, రిథమ్‌ స్పెషాలిటీ క్లినిక్స్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మనం సమతుల ఆహారాన్ని తీసుకోకపోవడం, శారీరక వ్యాయామం లేకపోవటంతో చాలామందికి పలు రోగాలు వస్తున్నాయన్నారు. ఇలాంటి ఆరోగ్య శిబిరాలలో వాటిని ముందుగా తెలుసుకుని వైద్యుల సలహాలు పాటించి నయం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. రోగం ముదిరి పరిస్థితి చేతుల దాటకముందే ప్రతి ఒక్కరూ ప్రతి సంవత్సరం అన్ని రకాల ఆరోగ్య పరీక్షలను చేయించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ వి.బాల్‌రెడ్డి, ధన్వీ మల్టీ స్పెషాలిటీ క్లినిక్స్‌ ఎండీ కె.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్‌లు, సిబ్బందితో పాటు వందలాది మంది టౌన్‌షిప్‌వాసులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.



కేంద్రం వదిలేసింది.. రాష్ట్రం పట్టించుకోదు.!

పన్నెండున్నరేళ్ళుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోని 'బయో డైవర్సిటీ పార్కు'


హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలో 2012లో ప్రారంభించే సమయంలో ఈ పార్కు పరిస్థితి (ఫైల్‌)

రాయదుర్గం: అంతర్జాతీయ సదస్సుకు స్మారకంగా ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా ఏర్పాటు చేసిన బయో డైవర్సిటీ పార్కు పరిస్థితి అధ్వానంగా తయారయ్యింది. స్థాయి అంతర్జాతీయమే కానీ గల్లీ పార్కు కన్నా అధ్వానంగా మారుతోందనేది వాస్తవం. అందరూ వ్యాఖ్యానించే స్థాయికి చేరిందని చెప్పక తప్పదు. పన్నెండున్నరేళ్ల అయినా ఎలాంటి ఎదుగు బొదుగు లేని పార్కుగా దీనిని చెప్పక తప్పదు. రాయదుర్గంలోని సర్వే నం.83 నాలెడ్జి సిటీ ప్రాంతంలోని 15 ఎకరాల విశాల స్థలంలో కాప్‌–11 సదస్సుకు చిహ్నంగా పైలాన్‌, పార్కును కూడా నిర్మించారు. పచ్చదనం కోసం ప్రపంచంలో అరుదుగా లభించే 200 మొక్కలు నాటి పెంచడం, లాన్‌లు ఏర్పాటు చేశారు. కానీ అవన్నీ నేడు కళావిహీనంగా మారిపోతున్నాయి. అప్పట్లో ఏపీఐఐసీ, అటవీశాఖ, బయో డైవర్సిటీ బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో ఏడు కోట్లతో నిర్మించిన దీన్ని అక్టోబర్‌ 16, 2012న అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్‌ చేతుల మీదుగా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆరంభంలో పైలాన్‌, మొక్కలను పరిశీలించేందుకు పలు పాఠశాలల విద్యార్థులు ఇక్కడకు వచ్చి అన్ని విషయాలు గమనించి సేద తీరి వెళ్లేవారు. ఒక ఏడాది తర్వాత రావడం మానేశారు. రాష్ట్ర ప్రభుత్వం హరితహారం సమయంలో కొంత హడావుడి చేసి అనంతరం చేతులెత్తేశారు.

ఇక జీహెచ్‌ఎంసీ పరిస్థితి చెప్పనక్కర్లేదు..


- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంతర్జాతీయ స్థాయి జీవవైవిధ్య సదస్సుకు స్మారకంగా ఈబయో డైవర్సిటీ పార్కును ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.
- ఆ తర్వాత కేంద్రం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో దీని పరిస్థితి అధ్వానంగా మారిపోయింది.
- కేంద్రం పట్టించుకోదు.. రాష్ట్ర అసలు ముట్టుకోదు.. ఇక జీహెచ్‌ఎంసీ పరిస్థితి చెప్పనక్కర్లేదు.
- నగరంలో పలు పార్కులు, ముఖ్యంగా థీమ్‌పార్కులను కూడా ఏర్పాటు చేసిన జీహెచ్‌ఎంసీ దీనిని పట్టించుకోవడమే లేదు. మాకు ఈ పార్కుతో ఎలాంటి సంబంధం లేదని చెప్పకనే చెబుతున్నారని అనుకోవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.
- దీంతో ఇది కాస్తా ఎవరికీ పట్టని పార్కుగా మారిపోయిందని అందరూ అభిప్రాయపడుతున్నారు.
- పన్నెండున్నరేళ్లుగా నిర్వహణను టీజీఐఐసీ సంస్థకు వదిలేసి చేతులు దులుపుకున్నారని అందరూ అంటున్నారు.

బయో డైవర్సిటీ పార్కు, ఫైలాన్‌ ఇదే మొదటిది..

- కాప్‌ సదస్సులను హైదరాబాద్‌లో నిర్వహించే వరకు 11దేశాల్లో నిర్వహించినా,ఎక్కడా సదస్సు చిహ్నంగా పార్కు, పైలాన్‌ నిర్మించలేదు.
- మొదటి సారిగా మనదేశంలోనే నిర్మించడం ఈ సదస్సు ప్రత్యేకతని అధికారులే పేర్కొన్నారు.
- సదస్సు సందర్భంగా 200 దేశాలకు విభిన్న రకాల మొక్కలను ఆ దేశ చిహ్నంగా నాటాలని నిర్ణయించామని అందులో 101 దేశాల ప్రతినిధులు మొక్కలు నాటారు.
- ఆతర్వాత నాలుగేళ్ళకు అప్పటి పాకిస్తాన్‌ హైకమిషనర్‌ సల్మాన్‌ బషీర్‌ వచ్చి మొక్కను పరిశీలించి, పార్కు, పైలాన్‌ ప్రాధ్యాన్యతను తెలుసుకున్నారు.
- నాటి నుంచి వాటి ప్రగతిని బట్టి ఫొటోలు తీసి వెబ్‌సైట్‌లో ఉంచడంతో పాటు ఐక్యరాజ్య సమితిలోని కన్వెన్షన్‌ ఆన్‌ బయోలాజికల్‌ డైవర్సిటీ సంస్థకు, ఆయా దేశాలకు కూడా పంపుతున్నట్లు అధికారులు అప్పట్లో స్పష్టం చేశారు. కానీ ఇప్పటి వరకు ఎవరూ వీటిని పరిశీలించిన దాఖలాలు లేవు.

ఈ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌...

- బయో డైవర్సిటీ పార్కు నిర్వహణ బాధ్యతను ఇటీవల ఫీనిక్స్‌ గ్రూప్‌కు అప్పగించినట్లు అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరింతగా ఆకర్షించేలా చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ పార్కులో ఈ క్రింది సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని పలువురు డిమాండ్‌ చేస్తున్నారు.
- పచ్చదనం మరింతగా పెంచి ఆకట్టుకునేలా చుట్టూరా వాకింగ్‌ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలి
- క్యాంటిన్‌ సౌకర్యం,ఆక్వేరియం, మ్యూజియం, సేద తీరేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలి.
- నిర్మాణం చేసి తాళంవేసి ఉంచిన బాత్‌రూమ్‌, ల్యాట్రిన్లు అందుబాటులోకి తేవాలి
- ప్రతి వీకెండ్స్‌లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించేలా చూడాలి
- ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థలాన్ని కూడా వినియోగంలోకి తీసుకరావాలి.
- ప్రస్తుతం కొనసాగుతున్న ఖాళీ స్థలంలోని పిచ్చిమొక్కలు, వ్యర్థాలు తొలగించాలి
- పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించి వీకెండ్స్‌లో అందరూ సేద తీరేలా థీమ్‌ పార్కులలాగా దీనిని అంతర్జాతీయ స్థాయిలో తయారు చేయాలి.



పత్తాలేని మ్యూజియం, అక్వేరియం నిర్మాణం...

- బయో డైవర్సిటీ పార్కుకు కేటాయించిన 15 ఎకరాల స్థలంలోనే రూ. 100 కోట్లతో జీవవైవిధ్య మ్యూజియం, రూ.100 కోట్లతో ప్రత్యేక అక్వేరియం నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం తలపెట్టింది.
- ఈ అంశాన్ని స్వయంగా అప్పట్లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అక్టోబర్‌ 22, 2012న జూబ్లీహిల్స్‌లో కమ్యూనిటీహాల్‌కు శంకుస్థాపన చేసిన తర్వాత ప్రకటించారు.
- అంతేగాక అక్టోబర్‌ 18, 2012న అప్పటి కేంద్ర అటవీ, పర్యావరణశాఖ కార్యదర్శి చటర్జీ రూ. 100కోట్లతో ఆక్వేరియం, మ్యూజియాన్ని న్యూఢిల్లీలో మొదట్లో ఏర్పాటు చేయాలనుకున్నారు. కానీ సదస్సు నిర్వహించిన హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని ప్రకటించినా ఇది కాస్తా అప్పటి నుంచి ప్రకటనలకే పరిమితమైంది.


హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని బయో డైవర్సిటీ పార్కులో 2016 వరకు రోజు ఇలానే విద్యార్థులు పరిశీలనకు వచ్చేవారు ఆ తర్వాత ఎవరూ ఈ దిక్కు చూడడం లేదు (ఫైల్‌)

మౌలిక వసతులకు ప్రాధాన్యమిస్తాం

కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌


బాపూనగర్‌లో కార్పొరేటర్‌కు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

శేరిలింగంపల్లి: బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ తెలిపారు. శేరిలింగంపల్లి డివిజన్‌ గోపీనగర్‌, బాపూనగర్‌లలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆదివారం పరిశీలించారు. స్థానికులు పారిశుద్ధ్య సమస్య, ఓపెన్‌ డ్రైనేజీలు నిండిపోయాయని కార్పొరేటర్‌కు వివరించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్‌ మాట్లాడుతూ... పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు అవసమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న విద్యుత్‌ స్తంభాలను క్రమబద్ధంగా ఏర్పాటు చేయాలని ఎలక్ట్రికల్‌ ఏఈకి ఫోన్‌ ద్వారా తెలిపారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమాన్‌ యూత్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌, నాయకులు గోపాల్‌యాదవ్‌, ప్రభాకర్‌, మహేష్‌చారి, వీరేందర్‌, జనార్దన్‌, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు భవనాన్ని నిర్మిస్తాం

ప్రభుత్వ చీఫ్‌ విప్‌ ఆది శ్రీనివాస్‌

మణికొండ: మున్నూరు కాపు కులస్తులకు కోకాపేటలో కేటాయించిన ఐదు ఎకరాల భూమిలో త్వరలోనే ఆత్మగౌరవ భవనం, వసతిగృహం నిర్మాణానికి కృషి చేస్తామని ప్రభుత్వ చీఫ్‌ విప్‌, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ అన్నారు. ఆదివారం ఆయన కుల సంఘం నాయకులతో కలిసి కోకాపేటలో కేటాయించిన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వం పలు కులాలకు భూములను కేటాయించి భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయటంలో విఫలం అయ్యిందన్నారు. ఒకటి, రెండు కులాల భవనాల నిర్మాణం పూర్తి అయినా వాటిల్లో ఎలాంటి కార్యకలాపాలను ప్రారంభించకుండా నిరుపయోగంగా ఉంచారన్నారు. మున్నూరు కాపు కుల భవనం నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి నిధులను విడుదల చేయిస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్‌ బొంతు రాంమ్మోహన్‌, కరీంనగర్‌ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ సత్తు మల్లేష్‌, గండిపేట మండల నాయకుడు గోపాల గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాభారతి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఆపరేషన్‌ సింధూర్‌ విజయానికి శ్రమించిన భారత సైనికులకు మద్దతుగా ఆదివారం క్రీడాభారతి తెలంగాణ అధ్యక్షుడు సతీష్‌గౌడ్‌ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీహెచ్‌ఈఎల్‌ టౌన్‌షిప్‌లో నిర్వహించిన ర్యాలీలో 250 మంది క్రీడాభారతి సభ్యులు పాల్గొని జాతీయ జెండాలతో భారత్‌ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్‌ ఎయిర్‌ ఫోర్స్‌ అధికారులు శ్రీనివాస రఘునందన్‌, శ్రీనివాస్‌, క్రీడాభారతి సభ్యులు పాల్గొన్నారు.

బొల్లారంలో..

జిన్నారం (పటాన్‌చెరు) : పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన భారత త్రివిధ దళాలకు బొల్లారంలో జేజేలు పలికారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో సైనికులకు మద్దతుగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్‌ మాజీ కౌన్సిలర్‌ చంద్రారెడ్డి, సీఐ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మున్సిపల్‌ వాసులు త్రివర్ణ పతాకాలతో భారత్‌ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. పాకిస్తాన్‌ దుశ్చర్యలకు భారత్‌ సమర్థవంతంగా తిప్పికొట్టిందని పేర్కొన్నారు. అఖిలపక్ష నాయకులు ఆనంద్‌ కృష్ణారెడ్డి, గుడ్ల మహేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, స్థానికులు పాల్గొన్నారు.


జిన్నారం: ర్యాలీలో పాల్గొన్న నాయకులు

నేడు ప్రజావాణి

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉప కమిషనర్‌ డాక్టర్‌ రవికుమార్‌ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి ఉంటుందన్నారు. రాజేంద్రనగర్‌, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్‌, అత్తాపూర్‌ డివిజన్లకు చెందిన ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణిలో అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయా ఫిర్యాదులపై అక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్‌ఎస్‌కే పట్కర్‌-ఖత్రి సమాజం ఎన్నికలు



రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ ఎస్‌ఎస్‌కే పట్కర్‌-ఖత్రి సమాజం 2025–28వ సంవత్సరాలకుగాను ఎన్నికలు ఆదివారం రంగారెడ్డి జిల్లా రాఘవేంద్ర నగర్‌లోని సమాజ కార్యాలయంలో నిర్వహించారు. మన తెలంగాణ ఎస్‌ఎస్‌కే ప్రాంతీయ సమాజ్‌ న్యాయ సహదారులైన కర్తన్‌ చంద్రశేఖర్‌ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. డాక్టర్‌ అశ్వినీకుమార్‌ మెంగ్జీ, రాజ్‌ కుమార్‌ జ్యోతి ఎన్నికల కమిటీ సభ్యులుగా సహకరించారు.

నూతన కార్యవర్గం...

అధ్యక్షుడిగా డాక్టర్‌ ఆనంద్‌రావు మెంగ్జీ, ఉపాధ్యక్షుడిగా ఉమేశ్‌ చవాన్‌, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్‌ హబీబ్‌, సంయుక్త కార్యదర్శిగా మహేశ్‌ చవాన్‌, కోశాధికారిగా రజనీకాంత్‌ తిర్మల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజేంద్రనగర్‌ సమాజానికి చెందిన పలువురు సభ్యులు ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొన్నారు. ఫలితాల ప్రకటన అనంతరం నూతన అధ్యక్షుడు డాక్టర్‌ ఆనంద్‌ రావు మెంగ్జీ సభ్యులందరికి కృతజ్ఞతలు తెలిపారు. సమాజం అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తానని స్పష్టం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజేంద్రనగర్‌: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన రాజేంద్రనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మామిడి కిశోర్‌ సమాచారం మేరకు... ఉప్పర్‌పల్లి పిల్లర్‌ నంబర్‌–178 వద్ద గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు సమాచారం అందింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని... ఒంటిపై నలుపు రంగు, చెడ్డీ ధరించి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే మార్చురీ సిబ్బందిని లేదా రాజేంద్రనగర్‌ పోలీసులను సంప్రదించాలన్నారు.

ఘనంగా అహల్యాబాయి హోల్కర్‌ జయంతి



నానక్‌రాంగూడలో రాణి అహల్యాబాయి హోల్కర్‌ జయంతి వేడుకల్లో బీజేపీ నాయకులు

రాయదుర్గం: రాణి అహల్యాబాయి హోల్కర్‌ 300 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నానక్‌రాంగూడలోని బీజేపీ గచ్చిబౌలి డివిజన్‌ కార్యాలయంలో ఆదివారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డివిజన్‌ అధ్యక్షుడు శివాసింగ్‌ మాట్లాడుతూ... రాణి అహల్యాబాయి హోల్కర్‌ తరహాలో మహిళలు తమ పరాక్రమాన్ని చాటారన్నారు. మహిళలందరికీ ఆమె స్ఫూర్తిదాయకంగా నిలుస్తారని గుర్తు చేశారు. దేశం గర్వించదగిన వారిని మనమెప్పుడూ గుర్తుంచుకోవాలని ఆయన కోరారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'మన్‌కీ బాత్‌'కార్యక్రమాన్ని బీజేపీ, బీజేవైఎం, మహిళా మోర్చా నాయకులు తిలకించారు. మోదీ జిందాబాద్‌, భారత్‌ మాతాకీ జై అంటూ ఈ సందర్భంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీన్‌లాల్‌ సింగ్‌, వసంతకుమార్‌యాదవ్‌, శ్రీకాంత్‌రెడ్డి, కిషన్‌, బబ్లూసింగ్‌, గోపాల్‌, సంకేత్‌సింగ్‌, రేవతి, వరలక్ష్మి, అసావరి, ఉదయలక్ష్మి, హేమ, నళిని తదితరులు పాల్గొన్నారు.


మన్‌కీ బాత్‌ కార్యక్రమాన్ని తిలకిస్తున్న నాయకులు

వరదనీటి కాల్వ పనులను వేగవంతం చేయాలి

మియాపూర్‌: వరదనీటి కాల్వ పనులు వేగవంతం చేయాలని కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌ పేర్కొన్నారు. డివిజన్‌ పరిధిలోని పటేల్‌ చెరువు సమీపంలో నూతనంగా చేపట్టిన వరదనీటి కాల్వ నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం దిశగా వరదనీటి కాల్వ నిర్మాణం పనులు చేపడుతున్నామని అన్నారు. వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పనుల్లో జాప్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్‌ ఏఈ సంతోష్‌, ఇరిగేషన్‌ ఏఈ పావని, కాలనీవాసులు రాములు, చైతన్య, వెంకటేశ్వర్లు, రాధా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


వరదనీటి కాల్వ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌

నిరుపేద యువతికి ఆర్థిక సాయం


వివాహ పత్రికను ఇస్తున్న కుటుంబ సభ్యులు

పటాన్‌చెరు టౌన్‌: నియోజకవర్గ పరిధిలోని ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటి నిలుస్తూ.. ఎప్పటికప్పుడు తన దాతృత్వాన్ని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చాటుకుంటూ ప్రజల గుండెల్లో నిలుస్తున్నారు. తాజాగా.. తెల్లాపూర్‌ మున్సిపల్‌ పరిధిలోని కొల్లూరుకు చెందిన వాటర్‌ వర్కర్‌ ఉద్యోగి మాణిక్యం ఇటీవల మృతి చెందారు. ఆయన కుమార్తె వివాహం నిశ్చయం కావడంతో ఆదివారం వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు పెళ్లి పత్రికను అందజేశారు. మాణిక్యంతో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్న ఎమ్మెల్యే యువతి వివాహానికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించి గొప్ప మనసు చాటుకున్నారు. భవిష్యత్తులోనూ వారి కుటుంబానికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొల్లూరు మాజీ ఎంపీటీసీ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

రైతుల భూములకు మార్కెట్‌ ధర ఇవ్వాలి

బీఆర్‌ఎస్‌ నాయకుడు గోవర్ధన్‌ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్‌ 109లో భూములకు మార్కెట్‌ వ్యాల్యూ ధర ఇవ్వాలని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇండస్ట్రియల్‌ ఐటీ పార్కు ఏర్పాటుకు సర్వే నంబర్‌ 109 లో 157 ఎకరాల భూములను రైతుల నుంచి తీసుకునేందుకు కసరత్తు పూర్తి చేసిందన్నారు. ఈ క్రమంలో భూములు ఇస్తున్న రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పోరా టాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. మండల అవసరాలకు 50 ఎకరాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతు లు తదితరులు పాల్గొన్నారు.